

## నిరాశజనకంగా టిడిపి, జనసేన మినీ మేనిఫెస్టో

### మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య

**ప్రజాశక్తి - పాలకొల్లు**

జనసేన, టిడిపి సంయుక్తంగా ప్రకటించిన మినీ మేనిఫెస్టో జనరంజకంగా, ఆకర్షణీయంగా లేదని మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య అన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్ల జనాభా ఆకాంక్షల మేరకు, వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ధీటుగా మినీమేనిఫెస్టో లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కనీసం నిరుపేదలకు కడుపు నిండా తిండి అందించే లక్ష్యం కానరాలేదన్నారు. కూరగాయలు, పప్పు దినుసులు వంటి నిత్యావసర వస్తువుల సేకరణ వంటి నిర్దిష్ట ప్రతిపాదనలు మేనిఫెస్టోలో లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. కొందరి సంక్షేమానికే పరిమితమై ప్రకటించిన ఈ మినీ మేనిఫెస్టో తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. కనీసం నాలుగు కోట్ల జనాభా సంతృప్తి చెందేలా ఆకర్షణీయంగా మేనిఫెస్టో తీర్చిదిద్దాలని కోరారు.

# దాళ్వాకు సమృద్ధిగా నీరు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సాగుకు 91.35 టిఎంసిల నీరు అవసరం**
**అందుబాటులో ఉన్నది 82.49 టిఎంసిల నీరే**
**వంతులు, నీటిని ఎత్తిపోసే విధానాల్లో సాగునీరు అందజేత**
**మార్చి నెలాఖరుకు కాలువల మూసివేత**
**గుర్రపుడెక్క, తూడు తొలగించి శివారు భూములకు సాగునీరు అందించేలా ఆదేశాలు**
**జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్**
**కరువు మండలాలపై తీర్మానానికి సమావేశం విముఖత**
**కీలకమైన సాగునీటి సమావేశానికి ఐదుగురు ఎంఎల్‌ఎలు డుమ్మా**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఉమ్మడి జిల్లాలోని దాళ్వా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సమృద్ధిగా సాగునీరు అందించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సంయుక్త సమావేశంలో దాళ్వా సాగుకు నీటి లభ్యత, పంటల ప్రణాళికపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా జిల్లాలో అందుబాటులో ఉన్న నీటిని దాళ్వా సాగుకు పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పటిష్టమైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. నెలాఖరుకల్లా నారుమళ్లు వేసుకునేలా రైతులను సమాయత్తం చేయాలని, రైతుభరోసా కేంద్రాల స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి లీకేజీలను అరికట్టడం, షట్టర్లు మరమ్మతులు చేయించడం, చెరువులు, కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు భూములకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు తెలిపారు. ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తారని అంచనా వేస్తున్నామని, దీనికి తగిన విధంగా రైతులు ఈ నెలాఖరులోగా నారుమళ్లు వేసుకునేలా చూడాలని, అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో వరిసాగుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, తృణధాన్యాలు పండించేలా రైతులను ప్రోత్సవించాలన్నారు. దాళ్వాసాగుకు సంబంధించి గోదావరి డెల్టా పరిధిలోని విభజిత ఐదు జిల్లాలకు నీటి సరఫరా నిమిత్తం (తాగునీటితో కలిపి) 91.35 టిఎంసిల నీరు అవసరమన్నారు. సాగునీటి కోసం సీలేరు నుండి 40 టిఎంసిలు, గోదావరి జలాల ద్వారా 30 టిఎంసిలు, పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వలు 12 టిఎంసిలు మొత్తం 82.49 టిఎంసిలు నీరు అందుబాటులో ఉందన్నారు. ఖరీఫ్‌లో పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని మంత్రి చెప్పారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ శివారు ప్రాంత రైతులకు సాగునీరు పూర్తిగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, కాల్వల్లో తూడు , గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్చి నెలాఖరుకు కాలువల మూసివేతకు సమావేశం నిర్ణయం తీసుకుంది. ఎర్రకాలువ ప్రాజెక్టు కింద 10,017 ఎకరాలు, జల్లేరు ప్రాజెక్టు కింద 3,400 ఎకరాలకు దాళ్వాలో సాగునీరు అందించాలని సమావేశంలో నిర్ణయించారు.



మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

**నెలాఖరుకు నారుమడుల పూర్తికి చర్యలు: కలెక్టర్**

జిల్లాలో రబీ సాగుకు కావాల్సిన నీరు అందుబాటులో ఉందని, ఎటువంటి ఇబ్బందీ లేదని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మండల, ఆర్‌బికె స్థాయిల్లో కూడా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అన్నివిధాలా అండగా ఉంటున్నామన్నారు. జిల్లాలో ఇ-క్రాప్ నమోదు చేయించి, రైతులందరినీ ఇకెవైసి చేయించామన్నారు. పంట నష్టపోయిన రైతులకు నిబంధనల మేరకు పంటల బీమా లేదా పెట్టుబడి రాయితీ అందిస్తున్నామన్నారు. జిల్లాలో రబీకి సాగు, తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వల్లో నీరు సాగుకు, తాగుకు, పశువులకు వినియోగించే అవకాశం ఉన్నందున తూడు, గుర్రపుడెక్క తొలగింపులో రసాయనాలు, క్రిమి సంహారక మందులు వినియోగించకుండా యంత్రాలు లేదా కూలీలతో తీయించాలన్నారు. మెట్ట ప్రాంతంలో ఎక్కడైనా పంట నష్టం జరిగినా నిబంధనల మేరకు పంటల బీమా కచ్చితంగా వస్తుందన్నారు. వర్షాభావ ప్రాంతాల్లో అపరాలు, తృణధాన్యాలు వరికి బదులు ప్రత్యామ్నాయంగా వేసుకోవాలని సూచించారు. పోలవరం బేసిన్‌లో నీరు నిల్వచేసి దానిని రబీ సాగుకు వినియోగించుకునేలా సమావేశం తీర్మానం చేసిందన్నారు.

**తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు భూములకు నీరివ్వాలి**
**ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు**

కొల్లేరు ప్రాంతంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, తూడు, గుర్రపుడెక్క నిర్మూలనకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ కోరారు. డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలన్నారు. కృష్ణా బోర్డుతో మాట్లాడి సాగర్ నుండి వచ్చే నీరు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మరో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సక్రమమైన నిర్వహణతో రబీలో సాగునీరు అందించాలన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసు (వాసుబాబు) మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, గణపవరం మండలాల్లో వెంకయ్యవయ్యేరు కాలవలో తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు. దీనిపై ఇరిగేషన్ ఎఇలు, డిఇలు దృష్టి పెట్టాలన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ ఎ.పోలవరంలో 110 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు కొంతమేర ఆక్రమణలకు గురైందని, వాటిని తొలగించడంతోపాటు పూడిక తీసి చెరువును పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి, ఇరిగేషన్ ఎస్ఇ వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎన్‌వివి.సత్యనారాయణ, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, నాబార్డు డిడిఎం నవకాంత్, ఎల్‌డిఎం నీలాద్రి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మంజుభార్గవి పాల్గొన్నారు.

**కరువు మండలాలపై తీర్మానం చేయండి**

**షేక్ సాబ్జీ, పిడిఎఫ్ ఎంఎల్‌సి**

ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పలు మండలాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు దెబ్బతిన్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేలా సమావేశంలో తీర్మానం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కోరారు. అయితే దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు విముఖత వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిన్నాయని, కాబట్టి కరువు మండలాల ప్రకటనకు నిబంధనలు వర్తించవని చెప్పారు. దీనిపై సిఎంకు నేరుగా వినతి ఇవ్వాలని ఎంఎల్‌సి సాబ్జీకి సూచించారు. దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ వస్తుందని, ఆర్‌బికెల ద్వారా సమోదైన పంటలకు నష్టపరిహారం అందుతుందని సమావేశంలో తెలిపారు. గోదావరి ఆయకట్టులో శివారు భూములకు సాగునీరు అందించాలంటే కాలువల్లో పేరుకుపోయిన గుర్రెపుడెక్క, తూడు తొలగించేవిధంగా ప్రణాళికలు అమలు చేయాలని సాబ్జీ కోరారు.



తణుకు చేరుకున్న మోటారు సైకిల్ ర్యాలీ

## నేడు ప్రజారక్షణ భేరి బహిరంగసభ

**విజయవాడ తరలిరావాలని సిపిఎం విస్తృత ప్రచారం**
**తణుకు మీదుగా ఏలూరు చేరుకున్న విశాఖ బైక్ యాత్ర**

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

విజయవాడలో బుధవారం జరిగే ప్రజారక్షణ భేరి సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలొచ్చి విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం విశాఖపట్నం నుంచి బయలుదేరిన ప్రజారక్షణ భేరి బైక్ యాత్ర స్థానిక ఉమెన్స్ కాలేజీ నుండి ఎన్‌టిఆర్ పార్క్, మున్సిపల్ ఆఫీస్, నరేంద్ర, వెంకటేశ్వర సెంటర్ల మీదుగా వై.జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల పక్షాన సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికను ఏ పార్టీ ఐనా అమలు చేయాల్సిందేనన్నారు. ఎపికి అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన వత్తాసు పలుకడం మానుకుని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోచించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎంను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎ.అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి, పిఎల్.నరసింహారావు, పి.దక్షిణామూర్తి, బళ్ల చినవీరభద్రరావు, జి.గోపీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : విజయవాడలో ఈ నెల 15న జరిగే ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. ఈ సందర్భంగా మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఆవరణలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ అన్ని అంగన్వాడీ, ఆశాలు, విఎఎలు, మధ్యాహ్న భోజన కార్మికులు ఈ సభకు తరలొచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీలక్ష్మి, నాగలక్ష్మి, నూక రత్నం, నేదూరి శివయ్య, హనుమాన్, జగదీష్, నాగరాజు, సుధాకర్, కుక్కల అప్పారావు, ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: అసమానతలు లేని అభివృద్ధి కోరుతూ ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పెదగరువులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మరియమ్మ, పిల్లి ఏసు, నన్నేటి నతానీయులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లడిల్లిన గుండెలు

**గంట వ్యవధిలో తల్లీ కొడుకు మృతి**
**నరసాపురంలో విషాదఛాయలు**





**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

గంట వ్యవధిలో తల్లీ కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపడమే కాకుండా నరసాపురం వాసులను కలచివేసింది. పట్టణంలోని స్టీమర్ రోడ్డులో ఫెర్రీ రేవు వద్ద కిరాణా వ్యాపారి ముత్తయ్య భార్య కారుమూరి అలివేలు మంగ (68), కొడుకు లక్ష్మణ్‌కుమార్ (45) కుటుంబాలు కలిసే ఉంటున్నాయి. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో లక్ష్మణ్ తన పిల్లలను స్కూల్ బస్సు ఎక్కించి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో టిఫిన్ చేస్తున్న మంగ తనకు వికారంగా ఉందంటూ కుప్పకూలింది. దీంతో తల్లడిల్లిన లక్ష్మణ్ అమ్మా.. అమ్మా అంటూ పెద్దగా కేకలు వేసి గుండెపోటుకు గురయ్యాడు. గత ఫిబ్రవరిలోనే లక్ష్మణకుమార్ రెండు స్టంట్లు వేయించుకున్నాడు. వారిని కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా తల్లీ కొడుకు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. తల్లీ కొడుకుల మృతి వార్త పట్టణవాసులను కలిచివేసింది. కిరాణా వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భీమవరంలో భారీ అగ్ని ప్రమాదం

**8 పోర్షన్ల రెండు తాటాకిళ్లు దగ్ధం**
**నిరాశ్రయులైన ఏడు కుటుంబాలు**
**విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణమని అంచనా**

**ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్**

వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు.. అంతా ఆదమరిచి నిద్రిస్తున్న వేళ చోటుచేసుకున్న అగ్నిప్రమాదం వారి జీవితాలను కుదిపేసింది. దీనికి సంబంధించి స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మెంటేవారితోటలో రెండు తాటాకిళ్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ రెండిళ్లలోని ఎనిమిది పోర్షన్లలో కంచర్ల భవాని, డి.దుర్గారావు, బూడిద ఆదిలక్ష్మి, మోటుపల్లి బేబీ సరోజిని, డి.మణి, బోయినపల్లి రమణయ్య, గుండెపల్లి చంద్ర ఏడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా ఇళ్లలో, దుకాణాల్లో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఒక ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. క్షణాల్లో అగ్నికీలలు ఎగసి పడి రెండు ఇళ్లను చుట్టుముట్టడంతో వారంతో ప్రాణభయంతో ఎక్కడి సామాన్లు అక్కడే వదిలేసి బయటపడ్డారు. సమాచారం అందుకున్న భీమవరం, ఆకివీడు అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేసేసరికే రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. సుమారు తొమ్మిది లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

**రూ.3.20 లక్షల నగదు దగ్ధం**

అగ్ని ప్రమాదంలో రూ.3.20 లక్షల నగదు కాలి బూడిదైంది. డ్వాక్రా మహిళలు బూడిగ ఆదిలక్ష్మి, గుండెపల్లి చంద్ర శుక్రవారం బ్యాంకులో చెరో రూ.లక్షా 60 వేలు చొప్పున రూ.3.20 లక్షలు రుణం తీసుకున్నారు. ఈ సొమ్మును ఇంట్లో బీరువాలో భద్రపర్చగా అగ్నిప్రమాదంలో కాలి బూడిదైందని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

**రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం**

అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. గదుల్లోని విలువైన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అగ్నిమాపక అధికారులు ఆస్తి నష్టం తక్కువ చూపారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో తమకు రూ.15 లక్షలు వరకూ ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

**అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం**

**అగ్నిప్రమాద బాధితులకు సిపిఎం పరామర్శ**
**దుప్పట్లు, భోజనాలు అందజేత**





భీమవరం: మెంటేవారితోటలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి, తీవ్రంగా నష్టపోయిన బాధితులకు సిపిఎం అండగా నిలిచింది. ఘోర అగ్నిప్రమాదంలో ఏడు కుటుంబాలు నిరాశ్రయులవ్వగా లక్షలాది రూపాయల నగదు, బంగారం బూడిదయ్యాయి. బాధితులకు సిపిఎం నేతలు పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం పునరావాసం కల్పించేంత వరకు అవసరమైతే సిపిఎం కార్యాలయంలో తలదాచుకోవాలని ఆసరా కల్పించారు. తక్షణ సాయం కింద దుప్పట్లు, భోజనాలు అందజేశారు. దాతల సహకారంతో సామగ్రి కూడా అందించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఘోర అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం, అధికారులు, స్థానిక ఎంఎల్‌ఎ తక్షణం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ బృందంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పట్టణ కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





**బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం**

**విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్**

**భీమవరం రూరల్:** అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని మెంటేవారితోటలో అగ్నిప్రమాదం విషయం తెలుసుకుని అక్కడికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఏడు బాధిత కుటుంబాలకు లక్షా ఐదు వేలు సొంత నిధుల నుంచి అందించారు. అందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని గ్రంధి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు, తహశీల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ రామిశెట్టి జయసూర్య, మద్దాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## విజ్ఞానాన్ని పెంపొందించేది గ్రంథాలయం

**మంత్రి కారుమూరి**

**ప్రజాశక్తి - తణుకు**

గ్రంథాలయం విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయ శాఖ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాల, బాలికలు అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ పుస్తకాల సముదాయమే గ్రంథాలయమని, అటువంటి గ్రంథాలయాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయం దేవాలయం లాంటిదని, విద్యార్థులు అందరూ గ్రంథాలయానికి వచ్చి చదవడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయ శాఖాధికారి కె.సుగుణకుమారి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు కవి తాడినాడ భాస్కరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మంగిన సూర్య, ఎఎంసి మాజీ ఛైర్మన్ చిట్టూరి శ్రీ వెంకట సుబ్బారావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు టిడ్కో ఇళ్ల వద్ద టిడిపి వంటావార్పు

**పోటీగా వైసిపి సమావేశం**

**పాలకొల్లు:** పాలకొల్లులో ఈ నెల 15న టిడ్కో గృహాల సముదాయంలో 'పాలకొల్లు చూడు' అనే వినూత్న కార్యక్రమం, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి నాయకులు పోలీసుల సాయంతో తమ కార్యక్రమాన్ని అడ్డుకుని పోటీగా సమావేశం పెట్టాలని చూడటం అప్రజాస్వామి కమన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాల పేరుతో దగాపడిన వేలాది మంది లబ్ధిదారులైన పేదలు, మహిళలతో నిరసన సభ జరుపుతామని, తాము వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇవ్వాలని, ఇళ్ల స్థలాలను నివాస ప్రాంతంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ మాటతప్పి పేదలను రుణగ్రస్తులను చేశారని విమర్శించారు.

**ఎవరికీ అనుమతి లేదు: సిఐ**

పాలకొల్లు టిడ్కో ఇళ్ల వద్ద ఈ నెల 15న టిడిపి, వైసిపి తలపెట్టిన ఆందోళనలకు ఎటువంటి పోలీస్ అనుమతులు లేవని పట్టణ సిఐ డి.రాంబాబు చెప్పారు. ఆయన మంగళవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ఒకే ప్రదేశంలో రెండు పార్టీలు ఆందోళన చేయడం వల్ల శాంతిభద్రతల సమస్య వస్తుందని, అందుకే పోలీస్ అనుమతి లేదని చెప్పారు. రెండు పార్టీలు వేర్వేరు రోజుల్లో ఆందోళన పెట్టుకుంటే అనుమతిస్తామని చెప్పారు. పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 18 నుంచి ఆపరేషన్లు ప్రారంభించాలి: కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**



'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపుల ద్వారా గుర్తించిన వారికి ఈ నెల 18 నుండి ఆపరేషన్లు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జెఎఎస్ క్యాంపుల ద్వారా గుర్తించిన వారికి తదుపరి చికిత్సపై సంబంధిత వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెఎఎస్ క్యాంపుల ద్వారా 1,584 మందిని తదుపరి చికిత్స నిమిత్తం రిఫర్ చేశామని, వీరిలో 356 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన వారికి రానున్న రెండు రోజుల్లో వైద్య పరీక్షలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెఎఎస్ క్యాంపుల ద్వారా 985 మందికి తదుపరి వైద్య సహాయం అవసరమని గుర్తించగా వారిలో 560 మందికి సాధారణ సర్జరీలు నిర్వహించడం, మిగిలిన వారికి నెలవారీ మందులను అందజేయాల్సి ఉందని వివరించారు. వారిలో ఇప్పటికే 25 మందికి సర్జరీలను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 535 మందితోపాటు, రిఫర్ చేసిన కేసుల్లో గుర్తించిన వారికీ కలిపి మొత్తం సర్జరీలు చేసేందుకు తేదీలవారీగా ఈ నెల 18 నుండి షెడ్యూల్ రూపొందించి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆపరేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన వారికి మందులను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. 2,610 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లను చేయాల్సి ఉందని, ఇప్పటికే 208 ఆపరేషన్లు పూర్తి చేశారన్నారు. మిగిలిన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. వయస్సుకు తగిన ఎత్తు లేకపోవడం, బరువు తక్కువగా ఉండటం, పౌష్టికాహార లోపం ఉన్న ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను 6,553 మందిని జెఎఎస్ ద్వారా గుర్తించామని, వారికి అవసరమైన పరీక్షలను వెంటనే పూర్తి చేయడానికి కృషి చేయాలని ఐసిడిఎస్ అధికారిని ఆదేశించారు.

**'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు**

'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ ఐదు రకాల ఆటలను విధిగా నిర్వహించాలని, దీనికి సంబంధించి 15 సంవత్సరాలు దాటిన బాల, బాలికల జట్లను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పోటీల నిర్వహణకు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలవారీగా అవసరమైన గ్రౌండ్‌లను సిద్ధం చేయడానికి డిపిఒ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు డిఎన్‌ఆర్ కాలేజీ, లూథరన్ హైస్కూల్, కెజిఆర్‌ఎ కాలేజ్ గ్రౌండ్లను ఎంపిక చేశామని, వాటిని సిద్ధం చేయడానికి మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిసెంబర్ 15 నుండి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు గ్రామస్థాయి నుండి ప్రారంభిస్తామని కలెక్టర్ వివరించారు.

**ఇంటర్ ఉత్తీర్ణత కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి**

ఇంటర్ ఉత్తీర్ణత కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వారు ఏదోక కోర్సులో తప్పనిసరిగా చేరేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశమై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత కాని విద్యార్థులు మళ్లీ ఇంటర్ విద్యను కొనసాగించడం, పరీక్షలకు ఫీజు చెల్లించడం, ఎపి ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందడం, ఏదైనా వృత్తి విద్య కోర్సులో చేరడం వంటి సమాచారాన్ని సేకరించాలన్నారు.

## భూహక్కు పత్రాల పంపిణీకి సిద్ధం చేయాలి

**జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి**

**భీమవరం:** అసైన్డ్ భూముల లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు అందించేందుకు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జెసి ఛాంబర్‌లో తొమ్మిది అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. లంక భూములు, ఫ్రీహోల్డ్ రైట్స్, ఇనాం భూములు, షెడ్యూల్ కేస్ట్ ఏరియాలో శ్మశాన భూములు, కమ్యూనిటీ హాళ్లు, ఎస్‌సి కార్పొరేషన్ భూములు, స్వమిత్వ, రీసర్వే ఫేజ్-2, ఎన్‌పిఐ హౌస్‌సైట్స్ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో లంక భూములు ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాలు 823 ఎకరాలు 1,181 మంది లబ్ధిదారులకు అందించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. అసైన్డ్ భూమి -ఫ్రీ హోల్డ్ 20 మండలాల్లో 53 గ్రామాల్లో 583 మంది లబ్ధిదారులకు 249.10 ఎకరాలు పంపిణీకి అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ఇనాం భూములు ఇద్దరు లబ్ధిదారులకు 88 సెంట్లు, ఎస్‌సి కార్పొరేషన్ భూములు ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామంలో 33 మంది లబ్ధిదారులకు 16.15 ఎకరాలు సిద్ధం చేశామన్నారు. ఎస్‌సి ప్రాంతాల్లో శ్మశాన భూములు, కమ్యూనిటీ హాళ్ల నిమిత్తం 44.14 ఎకరాలు ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ ట్రెయినీ కలెక్టర కానాల సంగీత్ మాథుర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్, ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్లు నాగమణి, గౌతమి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వా ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులకు నరసాపురం ఆర్‌డిఒ. ఎం.ఎ అంబరీష్ సూచించారు. మంగళవారం ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గోనె సంచులు, మౌలిక సదుపాయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబరీష్ మాట్లాడుతూ వివిఎలు సేకరించిన రైతుల వివరాలు, ఏ గ్రేడ్ మిల్లులు రవాణా చేసే వాహనాల రికార్డు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, ఆర్‌ఐ అప్పారావు, విఆర్‌ఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్ఐ షేక్ మదీనా భాషా అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దిశ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణచెరువు, మార్టేరు సెంటర్లో మహిళా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లతో వాహనదారులచే దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షేక్ మదీనా భాషా మాట్లాడుతూ సుమారు వెయ్యి మందిచే యాప్‌ను డౌన్‌లోడ్ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో 12 మంది మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆర్‌టిసి ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్‌టిసి ప్రయాణికులకు ఈ నెల 15 నుంచి గిఫ్ట్ స్కీమ్ ఏర్పాటు చేసినట్లు భీమవరం డిపో మేనేజర్ పివిఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూర్తి మాట్లాడారు. నాలుగు రూట్లలో గిఫ్ట్ స్కీమ్ పెడుతున్నామని, భీమవరం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నరసాపురం (మొత్తుపల్లి), తాడేపల్లిగూడెం (గణపవరం) మీదుగా ప్రయాణించే బస్సుల్లో ఈ గిఫ్ట్ స్కీమ్ ఉందని తెలిపారు. ప్రయాణం అనంతరం టికెట్ వెనక భాగాన మీ పేరు, ఊరు, సెల్ నంబర్ రాసి బస్‌లోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతినెల 1, 16 తేదీల్లో డ్రా తీసి డ్రాలో గెలుపొందిన ముగ్గురు విజేతలకు బహుమతులు ఇస్తామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు

**పాలకొల్లు:**పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు చెన్ను విజయ్, చినిమిల్లి గణపతి, ధనాల శ్రీను పాల్గొన్నారు.

## బాధితునికి జనసేన సాయం

**కాళ్ల:**కాళ్ల గ్రామానికి చెందిన పాట్టిపోతుల మురళీకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయనే మురళీకృష్ణ జనసేన సభ్యత్వం కలిగి ఉండడంతో పవన్ కళ్యాణ్ పంపిన రూ.50 వేల చెక్కును మంగళవారం పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు చేతులమీదుగా మురళీకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏడిదల రామాంజనేయులు, మండల యూత్ అధ్యక్షులు మేకా కాశీ చరణ్, మండల ఉపాధ్యక్షులు ఓగిరాల రాజేష్ పాల్గొన్నారు.

## గౌడ సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులోని గౌడ సెంటర్ పాపన్న గౌడ్ మండపం వద్ద గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా ఇర్రింకి శ్రీనివాస్, అంగర సుబ్బారావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షులుగా కారింకి సాయిబాబు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.పుల్లయ్య, కార్యదర్శిగా బెజవాడ సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా తొంటా చిన్న సత్యనారాయణ, కోశాధికారిగా సురేష్‌స్వామి, గౌరవ సలహా కమిటీ సభ్యులుగా అత్తిలి వెంకటేశ్వరరావు, పండు, కొండి రామకృష్ణ, పులివెల్ల శ్రీనివాస్, ఇర్రింకి విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా అత్తిలి గణేష్, సిహెచ్ రమేష్, మట్టా శ్రీనివాస్, బొర్రా సతీష్, తొంటా పెద్దిరాజు, అంగర నాగబాబు, చేబోలు నాగబాబు, కట్టా చంటి, సిద్దగని రాము, మదు పెద్దిరాజును ఎన్నుకున్నారు.


## నరసాపురంలో అన్నదానం

**నరసాపురం టౌన్:**అన్నదానానికి మించిన దానం లేదని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం కార్తీకమాసం తొలిరోజు సందర్భంగా నరసాపురం ఒకటో వార్డు శ్రీహరిపేటలో వీరభవాని అమ్మవారి ఆలయంలో మాదాసు వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాదాసు సతీష్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన కార్తీక మాస అన్న సమారాధనను రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నంద్యాల బాబు, మాదాసు సతీష్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి అధికారులే అడ్డంకి

### జెడ్‌పిటిసి లక్ష్మీ తులసి, సర్పంచి లక్ష్మి విమర్శ

ప్రజాశక్తి - పాలకోడేరు


ఫిర్యాదు పత్రాలను చూపిస్తున్న సర్పంచి, జెడ్‌పిటిసి

గ్రామాభివృద్ధికి అధికారులు అడ్డంకిగా మారారని పాలకోడేరు జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసి, గొల్లలకోడేరు గ్రామ సర్పంచి కుక్కల లక్ష్మి ఆరోపించారు. గొల్లలకోడేరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 7, 8 వార్డుల్లో రూ.16 లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటు, 11వ వార్డులో మరో రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, 2వ వార్డులో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ సాధారణ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. చిన్నపాటి వర్షానికి రోడ్లు మొత్తం జలమయమవుతున్న నేపథ్యంలో గ్రామస్తుల సౌకర్యార్థం రోడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానం చేసి ఐదు నెలలైనా సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్ గండి సూర్య వెంకట సత్యనారాయణ ఇప్పటివరకూ ఎస్టిమేట్లు ఇవ్వలేదన్నారు. అదేంటని అడిగితే పంచాయతీరాజ్ డిఇ రోడ్లు నిర్మాణానికి ఎస్టిమేట్లు ఇవ్వొద్దని చెప్పారని ఇంజినీరింగ్ అసిస్టెంట్ చెబుతున్నారని పేర్కొన్నారు. పనులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు కలిదిండి శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు.

## 'జగన్‌ను మరోసారి గెలిపించాలి'

**వీరవాసరం:**ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని నమ్మి వచ్చే ఎన్నికల్లో లబ్ధిదారులు మరలా ఓట్లు వేస్తే జగన్ మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం వీరవాసరం సచివాలయం-2లో మండల కన్వీనర్ కడలి ధర్మారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి చికెలే మంగతాయారు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపిటిసి బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

**మొగల్తూరు:**వైసిపికి ప్రజలతోనే పొత్తనీ పార్టీలతో కాదని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం ముత్యాలపల్లి, కొత్తట గ్రామాల్లో వైనీడ్ ఎపి సిఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశాల్లో ముదునూరి మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ పాల్గొన్నారు

**పెనుమంట్ర:**పెనుమంట్ర-1 సచివాల యం వద్ద జగనన్న ఎందుకు రావాలి కార్యక్రమానికి గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అధ్యక్షత వహించారు. ముందుగా అభివద్ధి కార్యక్రమాల ప్రచార సమాచార బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలు ఏ విధంగా ఉందో ప్రజలు గమనించాలన్నారు. అనంతరం హైస్కూల్ ఆవరణలోని వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ, గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



# పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

### రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. కాళ్లలో వైసిపి మండల అధ్యక్షులు గణేశ్న రాంబాబు అధ్యక్షతన జరిగిన జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాతపాటి వెంకట శ్రీనివాసరాజు పాల్గొని మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ పార్టీలకతీతంగా అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. గ్రామాల్లో కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం గ్రామంలో సంక్షేమ పథకాలు డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, దేవస్థానం ఛైర్మన్ గని శెట్టి షణ్ముఖ, మాజీ సర్పంచి గంటా ఆనందరావు, వైసిపి నాయకులు గంటా బాలు, అబ్బులు, నాగేశ్వరరావు, పంచాయతీ గ్రామ కార్యదర్శి బి.సతీష్‌కుమార్, సచివాలయం-2 కార్యదర్శి సింధుజా పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పాతపాటి వెంకట శ్రీనివాసరాజు

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి అందరూ మద్దతివ్వాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, నియోజకవర్గ చర్చా వేదిక టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు వైసిపి ప్రభుత్వంలో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు. అనంతరం పితాని మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు రచ్చబండ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న పాలకులు ధాన్యాన్ని, మిల్లర్లు దోచుకుంటున్నా ప్రశ్నించరా అని పితాని నిలదీశారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకు, రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలంతా సిద్ధం కావాలన్నారు. ఈ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దమన కాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులంతా వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయకుండా సంబరాలు జరుపుకోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, ఎస్‌సి సెల్ నియోజకవర్గ నాయకులు బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

ప్రజాశక్తి - ఉండి


ఉండి : కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, నేతలు

విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞానవంతులుగా మారతారని ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ అన్నారు. సోమవారం ఉండి, యండగండి శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్, యండగండి ఉపసర్పంచి పి.జగ్గరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు గిరిడా రమణ శ్రీనివాస్, కునుకు రమాదేవి శ్రీనివాస్, దత్తాల సుజాత రాణి, యండగండి రూరల్ బ్యాంక్ సెక్రటరీ చేకూరి రవికుమార్, నాయకులు రణస్థుల మహంకాళి, కమతం బెనర్జీ, విశ్వహిం దూ పరిషత్ సభ్యురాలు సునీత పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. యునైటెడ్ కాపు క్లబ్ ప్రెసిడెంట్ గాది ఆంజనేయులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాంటిస్సోరీ స్కూల్ సెక్రటరీ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, డైరెక్టర్ మద్దాల వాసు, ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మి, యునైటెడ్ కాపు క్లబ్ సెక్రటరీ పి.రవి పాల్గొన్నారు.

**పెనుమంట్ర :**మార్టేరు రోటరీ క్లబ్‌లో మానవత ఆధ్వర్యంలో మంగళవారం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. రోటరీ సెక్రటరీ చింత ధర్మ వీరనారాయణరెడ్డి, మానవత సెక్రటరీ బండి ప్రసాద్, గాంధీజీ, నెహ్రూల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, మార్టేరు సర్పంచి మట్టా కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో మానవత ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, మానవత ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రామారెడ్డి పాల్గొన్నారు.

**భీమవరం రూరల్ :** అడవి బాపిరాజు చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేశారు. ఇటీవల చింతలపాటి బాలరాజు ఉన్నత పాఠశాలలో బాలోత్సవం కమిటీ, ఫోరం ఫర్ ఆర్ట్స్, డ్రాయింగ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వేల మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కేటగిరిలో ప్రత్యేక బహుమతులను, డిఎన్‌ఆర్ కళాశాలకు కళాశాల అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న వెంకటేశ్వర బధిర పాఠశాల విద్యార్థులకు కూడా బహుమతులు ప్రకటించారు. వాటిని బాలల దినోత్సవం సందర్భంగా వాటిని గాంధీ కస్తూరిబా సేవా సంఘం భవనం వద్ద విద్యార్థులకు అందజేశారు.

ఆదిత్య హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలు వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు. స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదిత్య 'కృష్ణంరాజు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం రూరల్ : ఆదిత్య విద్యార్థులతో యాజమాన్యం

**గణపవరం :** నేటి యువతరానికి నెహ్రూ జీవితం ఆదర్శనీయమని గణపవరం సర్పంచి మూరా అలంకారం అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకురాలు సుభాషిని మాట్లాడారు. పిప్పర గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. గరికపాటి బాపయ్య శర్మ అధ్యక్షతన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు వై.నరసింహారావు వారోత్సవాలను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి సామ్యూల్ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ సాల్మన్‌రాజు, కె.వెంకటేశ్వరరావు, గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. శశి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పిల్లలకు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ మొహ మ్మద్ ఇస్మాయిల్ మాట్లాడి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**వీరవాసరం :** గ్రంథాలయ వారోత్సవాలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక బోను పవిడియ్య శాఖా గ్రంథాలయంలో వీరవాసరం సర్పంచి చికెలే మంగతాయారు, రాయకుదురు సర్పంచి గెడ్డం భారతీ భాస్కరరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చెన్ను భుజంగరావు, ఆర్.గాంధీ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులు మేధాశక్తిని పెంచుకోవచ్చని చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వేగేశ్న అనురాధ విద్యార్థులకు సూచించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు అందజేశారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

**పోడూరు :** గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. తొలుత గ్రంథాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొట్టి రామం, మంగాలక్ష్మి, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

**పాలకొల్లు :** జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఇఒ-2 ఆర్‌ఎస్‌విఎస్‌జి.శర్మ మాట్లాడారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వైష్ణవి విద్యార్థుల ఔదార్యం**

ఆచంట మండలానికి చెందిన విద్యార్థి శీలం దివ్య (9) లివర్ కేన్సర్‌తో బాధపడుతోంది. చిన్నారి వైద్యం నిమిత్తం పాలకొల్లు శ్రీవైష్ణవి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది సేకరించిన రూ.1,28,779ను దివ్య తల్లిదండ్రులకు మంగళవారం అందించారు. వైష్ణవి స్కూల్లో జరిగిన కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బివి రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

**మొగల్తూరు :** విద్యార్థులు బాగా చదువుకున్న ఉన్నత శిఖరాలు చేరుకోవాలని దాత గ్రంధి బాబి అన్నారు. బాలల దినోత్సవాన్ని మొగల్తూరులోని రెండో నంబరు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పాలపర్తి ఉషారాణి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు.

**ఉండి :** నేటి బాలలే రేపటి పౌరులు అని వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా వాండ్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బిఐ ఉండి బ్రాంచి మేనేజర్ నాగబాబు, భీమవరం రీజినల్ బ్రాంచి మేనేజర్ కె.నాగశయన రాజు సుమారు రూ.70 వేల విలువచేసే ఆర్‌ఒ వాటర్ ఫిల్టర్, టీవీ, ట్యాబ్‌లు అందజేశారు.

**భీమవరం రూరల్:** బాలల భవిష్యత్తుపై మనదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నో కలలు కన్నారని, దానికి సంబంధించి పలు అంశాలను ఆచరించి అమలు చేశారని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు అన్నారు. మంగళవారం వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెహ్రూ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. దీన్ని పలువురు యువతీ యువకులు, పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రాజు మాట్లాడుతూ నెహ్రూ జయంతినే బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు.

## మధుమేహం ప్రపంచానికి సవాలు

ప్రజాశక్తి - ఆకివీడు

మధుమేహం నేడు ప్రపంచానికి ఒక సవాల్ విసురుతోందని ఆ వ్యాధి వచ్చినవారు వెంటనే నిలువరించకపోతే ప్రాణాంతకంగా మారుతుందని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సదస్సుకు లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎంవి.సూర్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ మధుమేహం గురించి పూర్తిగా తెలుసుకునేందుకు ప్రత్యేక కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంవి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో 80 నుండి 90 శాతం వరకూ మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. త్వరలో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రోజుకు గంట వ్యాయామం తప్పనిసరిగా చేయాలని చెప్పారు. సదస్సులో ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఎం.ఉమా అలేఖ్య, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బి.శివరామకృష్ణంరాజు మాట్లాడారు.

## దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

చినకాపవరం గ్రామంలో రెండు సామాజిక తరగతుల మధ్య జరిగిన దాడిలో గాయపడిన బాధిత దళిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జి.సూర్య వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు అక్రమంగా బాధితులను నిర్బంధించడం తగదని తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ చట్టం కింద బాధితులకు పారితోషికాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు పివి రావు పొన్నమండ బాలకృష్ణ, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ పెద్దిరాజు, గోడి పెద్దిరాజు ఉన్నారు.

## వాసుదేవ్ ఆచార్య సేవలు ఎనలేనివి

### సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

**భీమవరం :**సిపిఐ (ఎం) సీనియర్ నాయకులు, కేంద్ర కమిటీ పూర్వ నాయకులు వాసుదేవ్ ఆచార్య దేశానికి విశేష సేవలందించారని, ఆయన సేవలు ఎనలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక మెంటేవారితోట సిపిఎం కార్యాలయంలో వాసుదేవ్ ఆచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సిపిఐ (ఎం) పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, ట్రేడ్ యూనియన్ నాయకులుగా ఆయన దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. బెంగాల్‌లో ఉగ్రవాదులను ఎదుర్కోవడంలో ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. పార్టీపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టడంలో ఆయన ముందువరుసలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, బి.వాసుదేవరావు, పట్టణ నాయకులు బొక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఉండి:**గ్రామంలోని ప్రజలంతా ఏకతాటిపై ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. మంగళవారం కలిగొట్లలో పలు అభివృద్ధి పనులకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాల్లో నరసింహరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తుందన్నారు. దానిలో రూ.15 లక్షలు వెచ్చించి డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.56 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంక్, సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందదాయకంగా ఉందని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతలపాటి వెంకటరామరాజు, రఘుపతిరాజు, ఆంజనేయరాజు, భాగ్యరాజు పాల్గొన్నారు.

## నడిపూడి ఇసుక ర్యాంపు పరిశీలన

**పెనుగొండ:**మండలంలోని నడిపూడి ఇసుక రేవులో అనుమతుల్లేక ఇసుక తవ్వుతున్నారనే సమాచారంతో మంగళవారం ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్ ఇసుక రేవును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడారు. అనుమతుల్లేకు ఇసుక తవ్వకూడదని, నిలిపివేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ గురుమూర్తిరెడ్డి, గోదావరి హెడ్ వర్క్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## హత్యా రాజకీయాలే జగన్ నైజం : పితాని

**పోడూరు:**హత్యా రాజకీయాలే జగన్ నైజమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో మండలంలోని మినిమించిలిపాడు, తూర్పుపాలెంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని స్థానికుల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రతిపక్ష నాయకులపై వ్యక్తి గత కక్షలు కట్టి వేధించాడని తెలిపారు. టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కార్యదర్శి బొక్కా సూర్యనారాయణ, గణపతినీడి రామ్మోహన్ పాల్గొన్నారు.

**In the Court of Princial Junior Civil Judge, Tanuku**
**O.S. No. 336/2020**

*Between:*
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
***Defendants:***
Katta Priyanka and another

వాది తరుపున చేయించిన ప్రకటన

*ప్రతివాదులు:*
1. కట్టా ప్రియాంక, W/o. వెంకటరత్నం, హిందువు, స్త్రీ, 34 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ఆదేశముల ప్రకారము ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటన తేది నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

**D.S.V.KRISHNAJI**
Advocate, Tanuku-534211

**మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి**
**ప॥గో॥జిల్లా :: ఏలూరు**
**ఐ.ఎ.నెం. 191/2023**
**ఓ.యస్.నెం. 26/2010**

***Between:***
తంగెళ్ళ వెంకటరాంబాబు మరియొక్కరు
...పిటీషనర్లు /వాదులు
మరియు
ఉప్పాల కళ్యాణి వగైరాలు ...రెస్పాండెంట్లు

**పిటీషనర్లు /వాదులు దాఖలు చేసిన పబ్లికేషన్**

పై నెంబరు గల పిటీషనులో రెస్పాండెంటు 16 అయిన 16) రాయంకుల శ్రీహరి, తండ్రి: లేటు సోభనాద్రి, డో.నెం. 3-354, ధర్మాజిగూడెం, లింగపాలెం మండలం, ఏలూరు జిల్లా వారికి పై నెంబరు గల పిటీషనులో **ది.16-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషను ఏకపక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**ఆవుల జగన్మోహనరావు**
**పుప్పాల రామకృష్ణ**
ఏలూరు, 14-11-23. అడ్వకేట్స్, ఏలూరు

**వేలం ప్రకటన**
**మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప॥గో॥జిల్లా ఏలూరు వారి కోర్టులో**
**ఇ.పి.నెం. 322/2011**
**ఇన్ ఓ.ఎస్.నెం. 348/2007**

***బిట్వీన్:***
శ్రీ గోళ్ళ యలమందల రావు
...డి.హెచ్.ఆర్ /వాది
అండ్
శ్రీ లంకా శ్రీనివాసరావు
శ్రీమతి లంకా రాజేశ్వరి
...జె.డి.ఆర్స్ /ప్రతివాదులు

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్స్ /ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములో గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.30-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును.** యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకో వచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

***షెడ్యూలు ఆస్థి వివరములు:*** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిష్టారు ఇలాకా, ఏలూరు నగరం, టి.ఎస్.నెం. 1572, పాత అసెస్మెంట్ నెం. 3294 దాఖలా చ॥గ॥లు 130 అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8 కు హద్దులు: ***దక్షిణం:*** శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి తాలూకు ఆస్థి. ***తూర్పు:*** డి.మధుసూధనారావు ఆస్థి. ***పడమర:*** మునిసిపల్ బజార్. ***ఉత్తరం:*** ఆర్.లక్ష్మణరావు ఆస్థి.

ఈ హద్దుల మధ్య సుమారు 130 చ॥గ॥ల ఇంటి స్థలం అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.

**డి.హెచ్.ఆర్ విలువ : రూ.2,00,000/-**
**అమీనా విలువ : రూ.7,50,000/-**

**ఈ. శ్రీనివాసబాబు**
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
15-11-23. ఫోన్: 08812-239498

**ప్రకటన**

నా క్లయింటు యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, అజిత్ సింగ్‌నగర్, లూనా సెంటర్, రైతుబజార్ దగ్గర, డోరు నెం.42-6-8 రు కాపురస్తులు తమ్మిన సన్నీ బాబు గారి కుమారుడు తమ్మిన సూర్య ప్రకాష్ గారు సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది, ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, అడవినెక్క గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తిని ది.10-07-2023వ తేదీన యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, దుర్గాపురం, 4వ లైన్, డోరు నెం.24-25-1రు కాపురస్తులు 1) దొడ్డపనేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు దొడ్డపనేని నవీన్‌కుమార్, మరియు 2) కొటపాటి గోవిందరెడ్డి గారి కుమారుడు కోటపాటి శ్రీనివాసరెడ్డి, 3) మట్లా అంకయ్య గారి కుమారుడు మట్లా రవీంద్ర, 4) మట్లా కొండలరావుగారి కుమారుడు మట్లా యశ్వంత్‌కుమార్, 5)జాజుల చిన కొండయ్య గారి కుమారుడు జాజుల మల్లిఖార్జునరావు గారలు, రేమాల సాయిప్రసాద్ వగైరాల వలన గన్నవరం సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం.7264/2023 రుగా క్రయం పొంది సదరు భూమిని ప్లాట్లుగా విభజించిన ఆస్తిలోని భాగమైనట్టి ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ నివేశన స్థలమును వలన విక్రయ ఖారు పొంది, మరికొద్ది రోజులలో విక్రయ దస్తావేజును వ్రాయించు కుని రిజిష్టరు చేయించు కోబోవుచున్నారు. కావున సదరు భూమిపై ఎవరికైనా యెట్టి అభ్యంతరములు గాని, హక్కులు గాని వగైరా అన్యాక్రాంతములు జరిపిన యెడల నాకు గాని, నా క్లయింటునకు గాని ఈ ప్రకటన విడుదల అయిన తేదీ నుండి 7 రోజుల లోపు తెలియపరచవలసినదిగా కోరుచున్నాము. సదరు గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని నా క్లయింటును బద్ధులను చేయ జాలవు.

**షెడ్యూలు:-**
ఏలూరు జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఆగిరిపల్లి మండలం, అడవి నెక్కలం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, అడవి నెక్కలం గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తి స్థిరాస్తిలో ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ స్థలముకు హద్దులు:
తూర్పు:అ.33.0లు వెడల్పు గల రోడ్డు అ.31.00లు
దక్షిణము:ప్లాటు నెం.24 అ.42.02లు
పడమర:దద్దనాల రంగారావు గారి భూమి అ.31.00లు
ఉత్తరము:ప్లాటు నెం.22 అ.41.10లు
యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.144.1 లేక చ.మీ.120.4 ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్నూ

**Torlikonda Ramakrishna, M.A.,L.L.B.**
**Advocate, D.No.7-135,**
**Venu Gopala Swamy Temple Street,**
**Nunna-521212,**
**Vijayawada Rural Mandal,**
**Krishna District, Cell:9849184404.**